
సాక్షి
బాపట్ల

సోమవారం ⁝ 6 ⁝ మార్చి ⁝ 2023



చిన్న తిరునాళ్ల సందడి

పెనుగంచిప్రోలు(జగ్గయ్యపేట): తిరుపతమ్మవారి చిన్న తిరునాళ్ల సందడి మొదలైంది. మార్చి 7 నుంచి 11వరకు ఐదు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేశారు.



సాగర్ నీటిమట్టం వివరాలు

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం ఆదివారం 544.30 అడుగుల వద్ద ఉంది. ఇది 197.4030 టీఎంసీలకు సమానంగా ఉంది.

ముగిసిన పింఛన్ల పంపిణీ



నెహ్రూనగర్: గుంటూరు జిల్లాలో వైఎస్సార్ పెన్షన్ కానుక పంపిణీ ప్రక్రియ ఆదివారం ముగిసింది. జిల్లాలో 2,51,256 మందికి రూ.69.02 కోట్లు పంపిణీ చేశారు.

న్యూస్‌రీల్

మాంసం దుకాణాల్లో తనిఖీలు

38 మందిపై కేసులు



నగరంపాలెం: ఉమ్మడి గుంటూరు జిల్లాలోని చేపలు, కోడి, మాంసం దుకాణాల్లో విజిలెన్స్ అధికారులు ఆదివారం విస్తృత తనిఖీలు చేపట్టారు. గుంటూరు విజిలెన్స్ ఎస్పీ ఎస్.వి.మాధవరెడ్డి ఆదేశాల మేరకు సోదాలు కొనసాగాయి. గుంటూరు నగరంలోని ఏటీ అగ్రహారం, గుజ్జనగుండ్ల, స్తంభాలగరువు, స్వామి థియేటర్ సెంటర్, నరసరావుపేటలోని మార్కెట్ సెంటర్, జొన్నలగడ్డ, రావిపాడు రోడ్ సెంటర్, బాపట్ల జిల్లాలోని చీరాల, కారంచేడు, పర్చూరులలో తనిఖీలు నిర్వహించగా, తూనికలలో వ్యత్యాసాలు, స్టాంపింగ్ లేని తూకాలు వినియోగిస్తున్న నిర్వాహకులను గుర్తించారు. గుంటూరు జిల్లాలో 12, పల్నాడు జిల్లాలో 15, బాపట్ల జిల్లాలో 11 కేసులు నమోదు చేసినట్లు విజిలెన్స్ సీఐ ఎ.శ్రీహరిరావు తెలిపారు. తనిఖీల్లో సీఐ టి.లక్ష్మారెడ్డి, ఎస్ఐ ఎం.రామచంద్రయ్య, తూనికలు- కొలతల శాఖ సహాయ కంట్రోలర్ జి.కొండారెడ్డి పాల్గొన్నారు.

ఆదర్శ రైల్వే స్టేషన్‌గా తీర్చిదిద్దుతాం

పిడుగురాళ్ల: పల్నాడు ప్రాంతంలోని పిడుగురాళ్ల రైల్వేస్టేషన్‌ను ఆదర్శ రైల్వేస్టేషన్‌గా తీర్చిదిద్దుతామని డీఆర్‌ఎం ఎం.రామకృష్ణ అన్నారు. గుంటూరు డివిజన్‌లో 16 రైల్వేస్టేషన్‌లను ప్రధానమంత్రి అమృత్ భారత్ పథకంలో భాగంగా అభివృద్ధి చేయడం జరుగుతుందని దీనిలో భాగంగా ఆదివారం పిడుగురాళ్ల రైల్వేస్టేషన్‌ను పరిశీలించడం జరిగిందన్నారు. ప్రయాణికుల సౌకర్యార్థం సౌకర్యవంతమైన విశ్రాంతి గది, ఓవర్ బ్రిడ్జి, లిఫ్ట్ సౌకర్యం వంటి వసతులు కల్పించేందుకు ప్రణాళికలు రూపొందించడం జరుగుతుందన్నారు. పిడుగురాళ్ల రైల్వే స్టేషన్‌లో ముఖ్యమైన రైళ్ల నిలుపుదల కోసం పలు వినతులు వచ్చాయని, త్వరలోనే వాటిని పరిష్కరించి ప్రయాణికుల సౌకర్యార్థం ఏర్పాటు చేస్తామన్నారు. ఏడీఆర్‌ఎం, రైల్వే సిబ్బంది పాల్గొన్నారు.

దుర్గగుడిలో పలువురికి అంతర్గత బదిలీలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఎన్టీఆర్ జిల్లా విజయవాడలోని శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో పలువురు ఉద్యోగులకు అంతర్గత బదిలీలు జరిగాయి. ఏఈఓలకు అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు ఆదివారం ఆలయ ఈఓ భ్రమరాంబ ఆదేశాలు జారీ చేశారు. ఏఈఓ చంద్రశేఖర్ ప్రస్తుతం అన్నదానం, అకౌంట్స్, స్టేషనరీ విభాగాల బాధ్యతలు చూస్తున్నారు. ఆయన వద్ద నుంచి అన్నదానం విభాగం తొలగించి పరిపాలనా విభాగం బాధ్యతలు అప్పగించారు. బి.వెంకటరెడ్డి ప్రస్తుతం ప్రొవిజన్ స్టోర్స్ నిర్వహణను చూస్తుండగా, అదనంగా అన్నదానం బాధ్యతలు అప్పగించారు. ఏఈఓ ఎస్.రమేష్‌బాబుకు మెయిన్ టెంపుల్, పూజలు, ఫెస్టివల్, ట్రస్ట్‌బోర్డు బాధ్యతలతో పాటు ప్రసాదాల తయారీ బాధ్యతలు అప్పగించారు. సూపరింటెండెంట్ వై.హేమదుర్గాంబకు ఫెస్టివల్, పూజలు, అకౌంట్స్, జనరల్, చీరల విభాగం బాధ్యతలు అప్పగించారు. జూనియర్ అసిస్టెంట్ వి.ప్రణీత్‌బాబును అన్నదానం నుంచి అకౌంట్స్ విభాగానికి, వి.ఉమాశంకర్‌ను ప్రసాదం టికెట్ల జారీ కౌంటర్ నుంచి అన్నదానానికి, సీనియర్ అసిస్టెంట్ వి.వెంకటేశ్వరరావును ప్రసాదాల టికెట్ల జారీ కౌంటర్ నుంచి పేబిల్స్, ఎస్ఆర్ ఎంట్రీల విభాగానికి బదిలీ చేశారు. ఎస్ఎంఆర్ పి.పవన్‌కుమార్‌ను మెయిన్ టెంపుల్ నుంచి ప్రసాదాల టికెట్ల కౌంటర్‌కు, ఎస్ఎంఆర్ పి.శ్రీనివాసులును మెయిన్ టెంపుల్ నుంచి ప్రసాదాల టికెట్ల జారీ కేంద్రానికి బదిలీ చేశారు.

ప్రార్థనలు చేస్తున్న హోసన్నా మినిస్ట్రీస్ అధ్యక్షుడు అబ్రహాం, చీఫ్ పాస్టర్ జాన్‌వెస్లీ, వేదికపై ఎమ్మెల్సీ డొక్కా, ఎమ్మెల్సీ అభ్యర్థి ఏసురత్నం దంపతులు



చివరిరోజు ప్రార్థనలకు హాజరైన విశ్వాసులు



‘దేవా.. నీ గుడారములో అతిథిగా ఉండనిమ్ము’

ఘనంగా ముగిసిన 46వ గుడారాల పండుగ ప్రార్థనలు

గుంటూరు గోరంట్లలో హోసన్నా మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో నిర్వహించిన 46వ గుడారాల పండుగలు ఆదివారంతో ముగిశాయి. మినిస్ట్రీస్ చీఫ్ పాస్టర్ జాన్‌వెస్లీ దైవసందేశం అందజేశారు. ఎమ్మెల్సీలు డొక్కా మాణిక్యవరప్రసాద్, లేళ్ల అప్పిరెడ్డి, ఎమ్మెల్యే మద్దాళి గిరి, నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు, మిర్చియార్డ్ చైర్మన్ చంద్రగిరి ఏసురత్నం దంపతులు ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. హోసన్నా మినిస్ట్రీస్ అధ్యక్షుడు బ్రదర్ అబ్రహాం 46వ గుడారాల పండుగలో పాల్గొన్న, సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.

- గుంటూరు రూరల్

దుర్గమ్మ సన్నిధిలో భక్తుల రద్దీ

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గా మల్లేశ్వర స్వామి వార్లను దర్శించుకుని ఆశీస్సులు అందుకునేందుకు ఎన్టీఆర్ జిల్లా విజయవాడ ఇంద్రకీలాద్రికి ఆదివారం పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. తెల్లవారుజాము నుంచే భక్తుల రద్దీ కనిపించింది. ఆది దంపతులకు నిర్వహించిన పలు ఆర్జిత సేవల్లోనూ ఉభయదాతలు విశేష సంఖ్యలో పాల్గొన్నారు. తెల్లవారుజామున ఖడ్గమాలార్చన, శ్రీచక్ర నవార్చన, లక్ష కుంకుమార్చన, చండీహోమం, నవగ్రహ హోమం, శాంతి కల్యాణంలోనూ ఉభయదాతలు పాల్గొన్నారు. ఆర్జిత సేవల్లో పాల్గొన్న ఉభయదాతలకు ప్రత్యేక క్యూలైన్ మార్గంలో అమ్మవారి దర్శనం కల్పించారు. సర్వ దర్శనానికి రెండు గంటల సమయం పట్టింది.

దిశ..భద్రతకు భరోసా

శ్రీకాకుళం జిల్లాకు చెందిన ఓ కుటుంబం కూలి పనుల నిమిత్తం తెనాలి వచ్చారు. అక్కడ వారితో పాటు వచ్చిన వారి కూతురు ప్రమీల తెనాలిలో తప్పిపోయింది. తప్పిపోయిన బాలికను తెనాలిలోని జేఎంజే స్వధార్ హోంలో పోలీసులు చేర్పించారు. 11 సంవత్సరాలుగా ఆ హోంలోనే ఉంటున్న ప్రమీలను గత కొద్ది రోజుల క్రితం తనిఖీల నిమిత్తం హోంకు వెళ్లిన మహిళ, శిశు సంక్షేమ అధికారులు(దిశ వన్ స్టాప్ సెంటర్) పరామర్శించారు. తనది శ్రీకాకుళం జిల్లా అని తనని ఇంటికి పంపించాలని ప్రమీల అధికారులను కోరడంతో అధికారులు సత్వరమే స్పందించి శ్రీకాకుళం జిల్లా పోలీసులను సంప్రదించి వారి ద్వారా బెన్నడుగూడ గ్రామంలో ఉంటున్న వారి తల్లిదండ్రుల చిరునామా సంపాదించగలిగారు. సచివాలయ మహిళా పోలీస్ సహకారంతో ప్రమీలను వారి తల్లిదండ్రులకు అప్పగించారు. దీంతో ప్రమీల ఎంతో ఆనందంగా తన ఇంటికి వెళ్లింది.

- మహిళలపై జరిగే లైంగిక వేధింపులు, చీటింగ్, ఇతర పలు అంశాల్లో రక్షణగా భరోసా ఇస్తున్న వైనం
- 24/7 అందుబాటులో కాల్ సెంటర్
- అత్యవసర పరిస్థితుల్లో ఐదు రోజుల పాటు సెంటర్‌లోనే బస చేసే వెసులుబాటు
- బాధితులకు సత్వర వైద్యం, న్యాయం చేసేందుకు చర్యలు

మహిళలకు అండగా దిశ వన్‌స్టాప్ సెంటర్



శ్రీకాకుళం నుంచి వచ్చిన కుటుంబ సభ్యులకు ప్రమీలను అప్పగిస్తున్న పీడీ మనోరంజని, దిశ న్యాయవాది విజయలక్ష్మి (ఫైల్)

నెహ్రూనగర్: మహిళల పాలిట రక్షణ కవచంలా దిశ వన్‌స్టాప్ కేంద్రం నిలుస్తోంది. మోసపోయిన, తప్పిపోయిన, వేధింపులకు గురైన ఎందరో అభాగ్యులైన బాలికలు, మహిళలకు అండగా నిలుస్తోంది. గుంటూరు జిల్లా పరిషత్ ఎదురుగా ఉన్న మహిళా ప్రాంగణంలో దిశ వన్‌స్టాప్ సెంటర్/సఖి కేంద్రం ఉంది. ఇక్కడ 24/7 సేవలందించేందుకు అధికారులు అన్ని చర్యలు తీసుకుంటున్నారు. ఈ సెంటర్‌లో ఒక మహిళా న్యాయవాది, కౌన్సిలర్, ముగ్గురు సెక్యూరిటీ గార్డ్స్, ముగ్గురు మల్టీపర్పస్ ఉమెన్ వర్కర్స్, కేస్ వర్కర్, ముగ్గురు పారా మెడికల్ సిబ్బంది, ముగ్గురు ఐటీ సిబ్బంది వీరితో పాటు ఎస్ఐ/ఏఎస్ఐ స్థాయి పోలీస్ అధికారి నిత్యం బాధితులకు అండగా ఉంటున్నారు. మహిళలపై జరిగే లైంగిక వేధింపులు, పనిచేసే ప్రాంతాల్లో వేధింపులు, ఫోన్ ద్వారా వచ్చే పలు సమస్యలపై(అసభ్య పదజాలం, దూషించడం, వేధింపులు), చీటింగ్, ఫోక్సో కేసులు వంటి తదితర ఇతర మహిళలకు సంబంధించిన అంశాల్లో 24/7 అన్ని వేళలా 0863-2233525 లేదా 181 కాల్ సెంటర్‌ను సంప్రదించవచ్చని అధికారులు చెబుతున్నారు.



ఐదు రోజుల పాటు తాత్కాలిక వసతి

ఏదైనా అత్యవసర సమయంలో మహిళ సదరు ఇంటిలో ఉండలేని పరిస్థితి నెలకొంటే దిశ వన్‌స్టాప్/సఖి సెంటర్‌లో ప్రత్యేకంగా ఏర్పాటు గదుల్లో సదరు మహిళ ఐదు రోజులు ఉండేందుకు వెసులుబాటు కల్పించారు. ఇక్కడే వసతి, భోజనం కల్పిస్తారు. ఈ ఐదు రోజుల పాటు బాధిత మహిళలకు భరోసా కల్పిస్తూ ఆమె భర్తకు, భర్త కుటుంబ సభ్యులకు కౌన్సెలింగ్ ఇచ్చి వారి కాపురాన్ని సరిదిద్దుతారు.

పరిష్కారం చూపేందుకే ప్రాధాన్యత

గుంటూరు జిల్లాలో గత సంవత్సరం నుంచి ఇప్పటి వరకు 272 కేసులు రాగా వాటిలో 60కి పైగా పరిష్కరించారు. మిగిలిన కేసులు కోర్టు పరిధిలో ఉన్నాయి. ఈ కేసుల్లో 25 శాతం సోషల్ మీడియా చాటింగ్, వీడియో కాల్స్ ద్వారా మహిళల్ని వేధించడం. 25 శాతం పెళ్లయిన తరువాత భర్త కుటుంబంపై భార్య కుటుంబ సభ్యుల ప్రభావం ఎక్కువగా చూపడం(ఉదహరణకు తల్లిదండ్రుల వద్ద గారాభంగా పెరిగిన వాతావరణం నుంచి భర్త దగ్గరకు రాగానే ఏదో ఇబ్బందులు పడుతున్నామని, తమ కంటే తన భర్త కుటుంబం ఆర్థికంగా తక్కువగా ఉన్నారనే ఫీలింగ్ రాగానే.. నీ భర్తను వదిలేసి ఇంటికి వచ్చేసేయ్ అని తల్లిదండ్రులు చెబుతున్న కేసులు) వంటి కేసులు అధికంగా ఉన్నాయని అధికారులు చెబుతున్నారు.

అపరిచిత వ్యక్తులకు దూరంగా ఉండాలి

సోషల్ మీడియా ద్వారా పరిచయమైన అపరిచిత వ్యక్తులతో ఇబ్బందులు పడుతున్న మహిళలు దిశ సెంటర్‌కు వస్తున్నారు. అదే విధంగా భర్త కుటుంబంపై భార్య కుటుంబ సభ్యుల ప్రభావం ఎక్కువగా ఉండటంతో మనస్పర్థలు వచ్చి విడిపోయే స్థాయికి చేరుకుంటున్నారు. భర్త లేదా భార్య కుటుంబం ఆర్థికంగా తక్కువగా ఉందనే భావన పక్కన పెట్టేసి కుటుంబ సభ్యులంతా కలిసి మెలిసి ఉండాలి.

- విజయలక్ష్మి,
దిశ వన్ స్టాప్/సఖి కేంద్ర న్యాయవాది

మహిళలు, బాలికలకు తగిన న్యాయం

జిల్లాలో మహిళలు, బాలికలకు ఎక్కడ ఏమి జరిగిన 0863-2233525 లేదా 181 కాల్ సెంటర్‌ను సంప్రదిస్తే సత్వర సహాయం చేయడంతో పాటు తగిన న్యాయం చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం. బాధితులైన బాలికలకు విద్యతో పాటు తగిన సంరక్షణ అందిస్తున్నాం. మహిళలకు తగిన రక్షణ కల్పిస్తున్నాం.

- బి. మనోరంజని,
మహిళా శిశు, సంక్షేమ శాఖ అధికారి

శింగరకొండ తిరునాళ్లు ప్రారంభం

ఉష్ట్ర పతాకాన్ని ఆవిష్కరించిన మేదరమెట్ల శంకరా రెడ్డి



ఉష్ట్రపతాక పూజల్లో శంకరా రెడ్డి, ట్రస్ట్‌బోర్డు సభ్యులు

అద్దంకి: జిల్లాలోనే ప్రముఖ పుణ్యక్షేత్రమైన శింగరకొండ లక్ష్మీ నరసింహ, ప్రసన్నాంజనేయ స్వామి 68వ వార్షిక తిరునాళ్ల ఉత్సవాలు ఆదివారం ఏసీ సుభద్ర, ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కోట శ్రీనివాసకుమార్ ఆధ్వర్యంలో ప్రారంభమయ్యాయి. పూజల్లో భాగంగా ఉదయం 8.30గంటలకు గణపతి పూజ, పుణ్యాహవచన, అఖండ దీపస్థాపన, మండప ఆరాధన పూజలు చేశారు. 9గంటలకు ధ్వజ స్తంభ నిర్మాణ దాత మేదరమెట్ల శంకరారెడ్డి ఉష్ట్రపతాక పూజ, ధ్వజారోహణ కార్యక్రమాలను నిర్వహించారు. వేదపండితుడు వంగల హరిశంకర అవధాని మాట్లాడుతూ తిరుణాళ్లను తయాహ్నికంగా ఆదివారం ఉదయం ప్రారంభించడం జరిగిందన్నారు. ఆ ప్రారంభ మహోత్సవానికి రమ్మని దేవతలను స్వామి వాహనం అయిన ఉష్ట్ర(ఒంటె)పతాకంతో ఆహ్వానించామని చెప్పారు. విశేషంగా ఏ దేవాలయంలోని లేని విధంగా స్వామికి ప్రతి రోజూ నిత్య అభిషేకం నిర్వహిస్తున్న విషయాన్ని వెల్లడించారు. భక్తులు మూడు రోజుల కార్యక్రమాల్లో పాల్గొని ప్రసన్నాంజనేయ, లక్ష్మీ నరసింహస్వామి దేవతల ఆశీస్సులు పొందాలని కోరారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ఉదయం 10గంటలకు భజన కార్యక్రమం నిర్వహించారు.

వామ్మో.. శునకాలు!

- నగరం, రూరల్‌లో కుక్కల స్వైరవిహారం
- కనిపించిన ప్రతి ఒక్కరికీ కాటు
- రాత్రిళ్లు అయితే మరీ దారుణం
- ప్రతి వీధిలో పదుల సంఖ్యలో..



న్యూగుంటూరు రైల్వే స్టేషన్ రోడ్డులో రాత్రిళ్లు కుక్కల స్వైర విహారం

నెహ్రూనగర్/గుంటూరు ఈస్ట్: గుంటూరు నగరం, గుంటూరు రూరల్ మండలాల్లో ఏ వీధిలో చూసినా వీధి కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. కనిపించిన వారిని కరుస్తూ భయాందోళనకు గురి చేస్తున్నాయి. రాత్రిళ్లు ఇంటి నుంచి రోడ్డు మీదకు రావాలంటే బయపడాల్సిన పరిస్థితి నెలకొంది. వీధి కుక్కల బారిన పడి ఎంతో మంది ఆసుపత్రుల పాలవుతున్నారు.

ఏబీసీ ఆపరేషన్లు చేయని అధికారులు..

వీధి కుక్కలకు పిల్లలు పుట్టకుండా యాంటీ బర్త్ కంట్రోల్(ఏబీసీ) ఆపరేషన్లు గతంలో ఏటుకూరు రోడ్డులో నగరపాలక సంస్థ అధికారులు పశు సంవర్ధక శాఖ డాక్టర్ల సహాయంతో చేసేవారు. అయితే గత రెండు సంవత్సరాల నుంచి ఈ ఆపరేషన్లు చేయకపోవడంతో కుక్కల సంతానోత్పత్తి అధికమైపోయింది. దీంతో రోడ్డు మీద వెళ్లేవారిని, బైక్‌లపై వెళ్లే వారిని అకస్మాత్తుగా వచ్చి కరిచేస్తున్నాయి. దీంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ముఖ్యంగా ప్రధాన కూడళ్ల వద్ద, రైల్వేస్టేషన్, బస్టాండ్ జనసంచారం అధికంగా ఉండే ప్రాంతాల్లో కుక్కల సంచారం అధికమవడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.

ఆదివారం ఒక్కరోజే 14 మందిపై దాడి..

ఆదివారం ఒక్క రోజే గుంటూరు నగరం, రూరల్ మండల పరిధిలో 14 మంది కుక్క కాటుతో గాయపడ్డారు. వారిలో 8 మంది చిన్నారులు కాగా, పెద్దవారు ఆరుగురు ఉన్నారు. వీరంతా జీజీహెచ్‌లో చికిత్స పొందారు. జీజీహెచ్‌లో ఏటీ అగ్రహారానికి చెందిన పదేళ్ల బాలతేజ, పాతగుంటూరుకు చెందిన 9 ఏళ్ల ఎల్.నందు, అంకిరెడ్డిపాలెనికి చెందిన 6 సంవత్సరాల కృపమ్మ, స్వర్ణ భారతి నగర్‌కు చెందిన ఆరేళ్ల ఆర్. ధనుష్, శ్యామలనగర్‌కు చెందిన 11 సంవత్సరాల ఎస్‌డీ సన, దాసరి పాలెంలో నివసించే నాలుగు సంవత్సరాల రెడ్డి ధర్మతేజ, గోరంట్లకు చెందిన 9 సంవత్సరాల టి.షణ్ముఖ సాయి, నగరానికి చెందిన 16 సంవత్సరాల ఎంఆర్ దిలీప్ కుక్కల దాడిలో గాయపడి చికిత్స పొందారు. ప్రథమ చికిత్స అనంతరం డిశ్చార్జి అయ్యారు. సంగడిగుంటకు చెందిన రాఘవులు, కొల్లిపర మండలం శివలూరుకు చెందిన డి.ఇస్సాక్, గుంటూరుకు చెందిన సీహెచ్ కృష్ణ మూర్తి, పెదకాకానికి చెందిన సయ్యద్ బషీద్, పాతగుంటూరుకు చెందిన ఎస్.నాగేశ్వరరావు, హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన డి.శ్రీనివాస్‌లు కుక్క కాటుకు గురై జీజీహెచ్‌లో ప్రాథమిక చికిత్స అనంతరం డిశ్చార్జి అయ్యారు.

కార్పొరేట్ విద్యాసంస్థల్లో పేదలకు 25 శాతం సీట్లు

బాపట్ల అర్బన్: విద్యాహక్కు(ఆర్టీఈ) చట్టం కింద రాష్ట్రంలోని ప్రైవేటు, అన్ ఎయిడెడ్ స్కూళ్లలో 2023–24 విద్యాసంవత్సరానికి ఒకటో తరగతిలో అర్హులైన పేద విద్యార్థులకు 25 శాతం సీట్ల కేటాయింపుపై ప్రభుత్వం ఫిబ్రవరి 26న జీవో 24ను జారీచేసినట్లు బాపట్ల జిల్లా విద్యాశాఖాధికారి పి.వి.జె.రామారావు ఆదివారం తెలిపారు. ఐబీ(అంతర్జాతీయ), ఐసీఎస్ఈ, సీబీఎస్ఈ, స్టేట్ సిలబస్ మేనేజ్మెంట్ల పాఠశాలల్లో విద్యాహక్కు చట్టం ప్రకారం 25 శాతం సీట్లను అర్హులైన పేదలకు కేటాయించాల్సి ఉందని చెప్పారు. సీట్లకు సంబంధించి మార్చి 4న నోటిఫికేషన్ విడుదల కానుందన్నారు. ఆయా ప్రైవేటు, అన్ ఎయిడెడ్ స్కూళ్లు మార్చి 6 నుంచి 16వ తేదీ వరకు హెటీటీపీ//సీఎస్ఈ.ఏపీ.జీవోవీ.ఇన్ విద్యార్థులు మార్చి 18 నుంచి ఏప్రిల్ 7వ తేదీ వరకు సంబంధిత వెబ్సైట్లో రిజిస్ట్రేషన్లు చేసుకోవాలని సూచించారు. అర్హులైన విద్యార్థుల ఎంపిక ఏప్రిల్ 9 నుంచి 12 వరకు ఉంటుందని చెప్పారు. మొదటి విడత కేటాయింపు ఏప్రిల్ 13న నిర్వహించనున్నట్లు చెప్పారు. విద్యార్థులు ఏప్రిల్ 15 నుంచి 21వ తేదీ లోపు ఆయా స్కూళ్లలో చేరికలను ఖరారు చేసుకోవాలన్నారు. రెండో విడత సీట్ల కేటాయింపు ఏప్రిల్ 25న, విద్యార్థులు ఏప్రిల్ 26 నుంచి 30వ తేదీ లోగా ఆయా స్కూళ్లలో చేరాల్సి ఉంటుందన్నారు. ప్రవేశాలకు సంబంధించి సమస్యలకు 14417 అను టోల్ ఫ్రీ నంబరును సంప్రదించవచ్చన్నారు. స్కూళ్లకు ఫీజు రీయింబర్స్మెంట్ కింద ఒక విద్యార్థికి పట్టణ ప్రాంతాల్లో రూ.8 వేలు, రూరల్లో రూ.6,500, గిరిజన ప్రాంతాల్లో రూ.5,100 చొప్పున చెల్లిస్తారన్నారు. ప్రైవేటు స్కూళ్లలో సీట్లు పొందిన పిల్లలకు సంబంధించి ఆయా స్కూళ్లకు చెల్లించాల్సిన ఫీజును నిబంధనలను అనుసరించి అమ్మఒడిని అందుకున్న అనంతరం విద్యాసంవత్సరం చివరన ఆయా స్కూళ్లకు రీయింబర్స్ చేస్తారు. అలా తల్లిదండ్రులు చెల్లించకపోతే ప్రభుత్వం ఆమొత్తాన్ని తదుపరి అమ్మ ఒడి నుంచి మినహాయించి స్కూళ్లకు చెల్లిస్తుందన్నారు. అనాథలు, హెచ్.ఐ.వి. బాధితులు, దివ్యాంగులకు 5 శాతం, ఎస్సీలకు 10 శాతం, ఎస్టీలకు 4 శాతం, ఏడాదికి గ్రామాల్లో రూ.1.20 లక్షలు, పట్టణాల్లో రూ.1.44 లక్షలలోపు ఆదాయం ఉన్న ఆర్థిక బలహీన వర్గాలలకు 6 శాతం సీట్లను కేటాయించినట్లు వివరించారు. ఆ రిజర్వేషన్లలో విద్యార్థులు లేకపోతే వాటిని ఇతరులకు కేటాయిస్తారు. గిరిజన ప్రాంతాల్లో మొదట ఎస్టీ పిల్లలకు ప్రాధాన్యం ఉంటుందన్నారు. అర్హులైన విద్యార్థులు అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

కడలి పుత్రుల జీవితాల్లో వెలుగులు

● నేడు బాపట్ల తీరప్రాంత గ్రామాల్లో కంటి వైద్య సేవలు ● బజరంగ్ ఫౌండేషన్ సీఈఓ అంబటి మురళీకృష్ణ

కొరిటెపాడు(గుంటూరు): బడుగుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు బజరంగ్ ఫౌండేషన్ నిర్విరామ కృషి చేస్తోందని, జగన్మామ సంక్షేమ సంవత్సరంలో భాగంగా బజరంగ్ నేత్ర జ్యోతి ఆధ్వర్యంలో బాపట్ల సముద్ర తీర ప్రాంత గ్రామాల్లో కంటి సేవలను అందించేందుకు రంగం సిద్ధం చేసినట్లు బజరంగ్ ఫౌండేషన్ సీఈఓ అంబటి మురళీకృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం బాపట్ల మండలంలోని ముత్తాయపాలెం కేంద్రంగా చేసుకొని గ్రామంలోని ఆంజనేయస్వామి విగ్రహం వద్ద భారీ స్థాయిలో కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఉదయం 8 గంటలకు ప్రారంభమయ్యే ఈ శిబిరాన్ని బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి ప్రారంభిస్తారని తెలిపారు. ఈ శిబిరం సాయంత్రం ఐదు గంటల వరకు కొనసాగుతోందని తెలిపారు. అవసరమైన వారికి తక్కువ వ్యవధిలోనే కళ్లజోళ్లు కూడా ఉచితంగా అందించడం జరుగుతుందని వివరించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్రెడ్డి సంక్షేమ సారథ్యంలో కోట్లాది మంది నిరుపేదల జీవితాల్లో పురోగతి తీసుకువచ్చేందుకు చిత్తశుద్ధితో కృషికి తోడుగా బజరంగ్ ఫౌండేషన్ ఓ వినూత్న పంథాలో ముందుకు సాగుతోందన్నారు. పూట గడవడం కోసం సముద్రంలో కెరటాలతో సహజీవనం చేసే తీర ప్రాంత గ్రామాల్లోని మత్స్యకార కుటుంబాలకు కూడా నేత్రజ్యోతి కార్యక్రమం ద్వారా సేవలందించడానికి బజరంగ్ ఫౌండేషన్ సిద్ధమైందన్నారు.

జియాలజీ విభాగ అభివృద్ధికి సంపూర్ణ సహకారం

పూర్వ విద్యార్థుల సమావేశంలో నిర్ణయం



జియాలజీ విభాగాధిపతి డాక్టర్ పీజే రత్నాకర్, ఆచార్య పి.శంకరపిచ్చయ్య, పూర్వ విద్యార్థులు

ఏఎన్యూ: ఆచార్య నాగార్జున యూనివర్సిటీ జియాలజీ విభాగాభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తామని ఆ విభాగ పూర్వ విద్యార్థులు హామీ ఇచ్చారు. జియాలజీ విభాగాధిపతి డాక్టర్ పీజే రత్నాకర్ అధ్యక్షతన ఆదివారం యూనివర్సిటీ జియాలజీ విభాగ పూర్వ విద్యార్థుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో విభాగం ఏర్పాటయిన 1985 నుంచి ఇప్పటి వరకు ఉన్న అన్ని బ్యాచ్ల పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు. వయస్సు, హోదా లేకుండా అన్ని బ్యాచ్ల వారు కలిసి సరదాగా గడిపారు. విద్యార్థులుగా, పరిశోధకులుగా తాము యూనివర్సిటీలో గడిపిన మధుర క్షణాలను గుర్తు చేసుకున్నారు. కొందరు పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ తాము జీవితంలో ఉన్నత స్థాయిలో స్థిరపడటానికి యూనివర్సిటీ పునాది వేసిందని, గురువులు తమకు చూపిన మార్గదర్శకం ఎప్పటికీ మరువలేమన్నారు. తాము ఎక్కడ పని చేస్తున్నా, ఎక్కడ ఉన్నా ఎప్పటికీ యూనివర్సిటీతో తమ అనుబంధం కొనసాగాలని ఆకాంక్షించారు. తమ ఉన్నతికి దోహదం చేసిన జియాలజీ విభాగాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు సంపూర్ణ సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. తాము పని చేస్తున్న జాతీయ స్థాయి, రాష్ట్ర స్థాయి జియాలజీ రంగ సంస్థలు, విద్యాసంస్థల్లో ఏఎన్యూ జియాలజీ విభాగ విద్యార్థులు, పరిశోధకులకు శిక్షణ, పరిశోధన ప్రాజెక్టుల్లో అవకాశం కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. జియాలజీ విద్యార్థులకు పాఠ్యాంశాలతో పాటు ఫీల్డ్కు సంబంధించిన ఇంటర్న్షిప్ ఎంతో అవసరమని, తమ సంస్థల్లో ప్రస్తుత విద్యార్థులకు అవకాశం కల్పిస్తామని హామీ ఇచ్చారు. జియాలజీ విభాగంలోని ల్యాబొరేటరీలు, మ్యూజియం మరింత అభివృద్ధి చేసేందుకు కావాల్సిన పరికరాలు అందిస్తామని తెలిపారు. సమావేశంలో విభాగ విశ్రాంత అధ్యాపకులు ఆచార్య రంగారావు, ఆచార్య పి.శంకరపిచ్చయ్య, పలు జాతీయ, రాష్ట్ర స్థాయి జియాలజీ రంగ పరిశోధనా సంస్థల్లో ఉన్నత స్థాయిలో పని చేస్తున్న అధికారులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

ఎంత మొత్తుకున్నా వ్యర్థమే

● బాపట్లలో అమలు కాని పాలిథిన్ నిషేధం
● 121 మైక్రాన్ల పాలిథిన్ ఉత్పత్తులను నిషేధించిన ప్రభుత్వం
● పట్టించుకోని వ్యాపారులు, ప్రజలు
● ఆందోళన వ్యక్తం చేస్తున్న పర్యావరణ ప్రేమికులు



బాపట్ల డంపింగ్ యార్డులో ప్లాస్టిక్ సంచుల వ్యర్థాలు

బాపట్ల: పాలిథిన్ ఉత్పత్తుల వినియోగం వల్ల ప్రజలతో పాటు ఇతర జీవాల ఆరోగ్యానికి ముప్పు కలగనున్న నేపథ్యంలో ప్రభుత్వం వాటి వినియోగాన్ని నిషేధించింది. పాలిథిన్ కవర్లు, కవర్ల కప్పులతో పర్యావరణం దెబ్బ తింటుందనే ఉద్దేశంతో బాపట్ల పట్టణ పరిధిలో వాటి విక్రయాలు మున్సిపాలిటీ రద్దు చేసింది. అలాగే ఉత్పత్తుల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన సదస్సులు కూడా నిర్వహిస్తున్నారు. అయితే ఎంత అవగాహన కల్పిస్తున్నా అటు వ్యాపారులు ఇటు ప్రజల్లో మాత్రం మార్పు రావడం లేదు. కొందరు అవగాహన లోపంతో వాటిని వినియోగిస్తుండగా, మరికొందరు వాటివల్ల కలిగే దుష్పరిణామాలు తెలిసి కూడా తేలిగ్గా వాడి పడెయ్యొచ్చు అనే ఉద్దేశంతో విచ్చలవిడిగా పాలిథిన్, ప్లాస్టిక్ను వాడేస్తున్నారు. దీనిపై పర్యావరణ ప్రేమికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. హోటళ్లు, కర్రీ పాయింట్లలో వేడి ఆహార పదార్థాలు కూరలు సాంబార్ చాయ్ కాఫీలను కూడా ప్రమాదకర కవర్లలో తీసుకురావడం విశేషం.

నిషేధంపై నిర్లక్ష్యం

2022 జూలైలో 75 మైక్రాన్ల లోపు ప్లాస్టిక్ కవర్లను ప్రభుత్వం నిషేధించగా.... డిసెంబర్లో 121 మైక్రాన్ల లోపు ఉన్న ఉత్పత్తులను నిషేధిత జాబితాలోకి చేర్చింది. అయితే అధికారులు మొక్కుబడిగా ఒకటి రెండు సమావేశాలు నిర్వహించి ఇక బాధ్యత తీరిపోయిందని మిన్నకుండిపోవడంతో పాలిథిన్ వినియోగం యథేచ్ఛగా కొనసాగుతుంది. అధికారుల తనిఖీలు, జరిమానాలు నామ మాత్రమే అయ్యాయి. బాపట్ల మున్సిపాలిటీ పరిధిలో ప్రతిరోజు 40 మెట్రిక్ టన్నుల చెత్త ఉత్పత్తి అవుతుండగా అందులో 30 నుంచి 40 శాతం వరకు ప్లాస్టిక్ వ్యర్థాలే ఉన్నట్లు సమాచారం.

మారితేనే సాధ్యం

పాలిథిన్ నిషేధంపై అధికారులు విద్యావంతులు స్వచ్ఛంద సంస్థలు యువజన సంఘాలు ముందుకొచ్చి ఉద్యమంలా ప్రజా చైతన్య కార్యక్రమాలు చేపట్టాల్సి అవసరం ఉంది. ప్లాస్టిక్ ప్రభావంతో జరిగే అనర్థాలను ప్రజలకు వివరించాలి. దుకాణదారులు, హోటల్ యజమానులు, కూరగాయలు, పండ్ల విక్రేతలతో సమావేశాలు నిర్వహించి అవగాహన కల్పించాలని పర్యావరణ ప్రేమికులు అభిప్రాయపడుతున్నారు.



చెత్తచెదారం తొలగించేందుకు ఏర్పాటు చేసిన కంపెనీ బోర్డు

అనారోగ్య సమస్యలు..

పేపర్ టీ కప్పులు, విస్తరాకులపై పలుచని పాలిథిన్ పొర ఉంటుంది. వేడి పదార్థాలు వేసినప్పుడు ఆ పొర కరిగి ఆహారంతో పాటు కడుపులోకి చేరుతుంది. తద్వారా క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉందని నిపుణులు చెబుతున్నారు. వేడి పదార్థాలు పాలు పెరుగు వంటి వాటికి డబ్బాలు గిన్నెలు వినియోగించాలని సూచిస్తున్నారు.

పాపం.. మూగ జీవులు..

కూరగాయలు ఇతర ఆహార పదార్థాలతో కూడిన ప్లాస్టిక్ సంచులు విస్తరాకులను నిర్లక్ష్యంగా పడడంతో పశువులు వాటిని తినేస్తున్నాయి. ప్లాస్టిక్ వ్యర్థాలు జీర్ణం కాక అనారోగ్యానికి గురయి, మరణిస్తున్నాయి. ఇప్పటికే పలుచోట్ల పశువులకు శస్త్ర చికిత్సలు చేసి ప్లాస్టిక్ వ్యర్థాలను తీసిన సంఘటనలు ఉన్నాయి. మానవ తప్పిదాలు మూగజీవాల పాలిట శాపంగా మారకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉంది.

చర్యలు తీసుకుంటాం



ప్లాస్టిక్ నియంత్రణపై చర్యలు తీసుకుంటున్నాం. ప్రత్యామ్నాయం వైపు ప్రజలు అలవాటు పడేలా అవగాహన కల్పిస్తున్నాం. ఇందుకోసం ర్యాలీలు నిర్వహిస్తున్నాం. ఇదివరకు తనిఖీలు చేపట్టి పలువురికి జరిమానాలు విధించాం. నిషేధిత ప్లాస్టిక్ నివారణపై అవగాహన కల్పిస్తాం. వ్యాపారులు సహకరించాలి.

– ఎ.భానుప్రతాప్, మున్సిపల్ కమిషనర్

నేడు డీపీఓలో మహిళలకు ఉచిత వైద్య శిబిరం

నగరంపాలెం(గుంటూరు): ప్రపంచ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం గుంటూరు జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలోని పోలీస్ యూనిట్ ఆసుపత్రిలో మహిళా పోలీసులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్హఫీజ్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఒమేగా ఆసుపత్రి సౌజన్యంతో ఉదయం 8 గంటలకు శిబిరం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. బీపీ, మధుమేహం, గుండె, క్యాన్సర్ వంటి వ్యాధులకు నిర్ధారణ పరీక్షలు నిర్వహించనున్నారు. మహిళా పోలీసులు, వారి కుటుంబ సభ్యులు (మహిళలు) సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ తెలిపారు.

రేపు 108 అంబులెన్స్ డ్రైవర్ పోస్టులకు ఇంటర్వ్యూలు

గుంటూరు మెడికల్: ఉమ్మడి గుంటూరు, ప్రకాశం జిల్లాల్లో 108 అంబులెన్స్లో డ్రైవర్ ఉద్యోగాలకు ఈ నెల 7వ తేదీ ఇంటర్వ్యూలు నిర్వహించన్తున్నట్లు హెచ్ఆర్ నరసింహరాజు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. హెవీ డ్రైవింగ్ లైసెన్స్, పదో తరగతి ఉత్తీర్ణులై ఇంగ్లిష్ చదవటం, రాయటం వచ్చిన 35 ఏళ్లలోపు వారు అర్హులని పేర్కొన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన వారికి నెలకు రూ.18 వేలు చెల్లిస్తారన్నారు. ఆసక్తి, అర్హత ఉన్న అభ్యర్థులు ఒంగోలు ఓల్డ్ రిమ్స్ క్యాంపస్లో ఉదయం 10 గంటలకు జరిగే ఇంటర్వ్యూలకు హాజరు కావాలని విడుదల చేసిన ప్రకటనలో కోరారు.

ఉరేసుకుని ఆర్మీ జవాన్ బలవన్మరణం

మూడు రోజుల తరువాత గుర్తించిన వైనం

చినగంజాం: వ్యక్తిగత సమస్యలతో ఓ ఆర్మీ ఉద్యోగి ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈఘటన మండలంలోని పెదగంజాం గ్రామంలో ఆదివారం రాత్రి వెలుగు చూసింది. ఎస్సై కట్టా అనూక్ వివరాల మేరకు.. మండలంలోని పెదగంజాం గ్రామానికి చెందిన ఆర్మీజవాన్ కోమట్ల రవీంద్రారెడ్డి (26) ఆర్మీలో ఉద్యోగం చేస్తున్నాడు. మూడు నెలలు క్రితం ఉద్యోగానికి సెలవు పెట్టి తన స్వగ్రామానికి వచ్చాడు. ఈ నేపథ్యంలో గడచిన మూడు రోజులుగా అతడు కనిపించకుండా పోయాడు. ఇదిలా ఉండగా ఆదివారం రాత్రి అతడు గ్రామంలోని జీడి తోటల్లో ఉరేసుకుని కనిపించాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి చూడగా చెట్టుకు వేలాడుతూ ఉన్న రవీంద్రారెడ్డి మృత దేహం కన్పించింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చీరాల వైద్యశాలకు తరలించారు.

నర్సింగ్ పూర్వవిద్యార్థుల సమ్మేళనం

26 ఏళ్ల తరువాత గుంటూరులో కలయిక



సమ్మేళనానికి హాజరైన నర్సింగ్ పూర్వ విద్యార్థులు

గుంటూరు మెడికల్: రోగుల సేవే తమ వృత్తిగా ఎంచుకుని ఎంతో మంది రోగుల ప్రాణాలు కాపాడటంలో వైద్యులతో పాటుగా తమవంతు పాత్ర పోషించిన గుంటూరు జీజీహెచ్ ప్రభుత్వ నర్సింగ్ పాఠశాల పూర్వ విద్యార్థులు ఆదివారం గుంటూరులో ఒక్కచోట చేరారు. గుంటూరు ఏపీఎన్జీఓ హోమ్ వద్ద అంతా కలుసుకుని పాతికేళ్ల జ్ఞాపకాలనుఎగుర్తు చేసుకున్నారు. నర్సింగ్ స్కూల్లో చదుకునే రోజుల్లో నిక్ నేమ్లతో పిలుచుకున్న పేర్లు నేడు ఒకసారి మననం చేసుకుని మధుర జ్ఞాపకాల్లో ఓలలాడారు. గుంటూరు జీజీహెచ్ ఆవరణంలోని ప్రభుత్వ నర్సింగ్ పాఠశాలలో 1994–1997లో జనరల్ నర్సింగ్ అండ్ మిడ్వైఫరీ కోర్సు పూర్తిచేసిన వారు ఏపీ ప్రభుత్వ నర్సుల సంఘం గుంటూరు జిల్లా సెక్రటరీ యల్లంపల్లి పద్మజ ఆధ్వర్యంలో ఆదివారం రీయూనియన్ పేరుతో కలుసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన నర్సింగ్ పాఠశాలను సందర్శించారు. అమెరికాలో నర్సింగ్ వృత్తిలో రాణిస్తున్న టి.మధురిమ, మేరీ, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్లోని వివిధ జిల్లాల్లో వివిధ హోదాల్లో నర్సింగ్ సేవలు అందిస్తున్న సుమారు 50 మంది పూర్వ విద్యార్థులు ఆత్మీయ కలయికలో ఉల్లాసంగా గడిపారు. కార్యక్రమంలో నర్సుల సంఘం సెక్రటరీ యల్లంపల్లి పద్మజ, విజయవాడ ఆయుష్ హాస్పటల్ నర్సింగ్ ఇన్చార్జి కె.రమాదేవి, కరీంనగర్ అపోలో హాస్పటల్ నర్సింగ్ సూపరింటెండెంట్ పద్మ, ఏపీఎస్ ఆర్టీసీ స్టాఫ్ నర్సు డి.వజ్రవతి, విజయవాడ హెడ్ నర్స్ జి.మాధవి తదితరులు పాల్గొన్నారు.

ఆత్మస్థైర్యంతో ఏదైనా సాధ్యం

గుంటూరు రూరల్: విద్యార్థులు జీవితంలో ఏమి సాధించాలన్నా ధైర్యం, ఆత్మస్థైర్యం ఉండాలి.. అవి ఉంటేనే విజయం మీ సొంతమవుతుందని రాజ్యసభ సభ్యుడు, రైటర్ అండ్ ఫిల్మ్ డైరెక్టర్ కేవీ విజయేంద్ర ప్రసాద్ అన్నారు. గుంటూరు రూరల్ మండలం పలకలూరులోని విజ్ఞాన్ నిరుల మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో రెండు రోజుల పాటు నిర్వహించిన జాతీయ స్థాయి టెక్నికల్, కల్చరల్, ఫైన్ ఆర్ట్స్, లిటరరీ, స్పోర్ట్స్ ఫెస్ట్ 'నిరులోత్సవ్–2కె23' వైభవంగా ముగిసింది. ముఖ్యఅతిథిగా హాజరైన రాజ్యసభ సభ్యుడు, రైటర్ అండ్ ఫిల్మ్ డైరెక్టర్ కేవీ విజయేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ జీవితంలో కష్టాలు, సమస్యలు, సవాళ్లు ప్రతి ఒక్కరికీ ఉండేవేనన్నారు. ఎలా పరిష్కరించుకోవాలో మనసు పెట్టి ఆలోచిస్తే కచ్చితంగా పరిష్కారాలు దొరుకుతాయని చెప్పారు. పేదరికం, ఆకలిని కఠినంగా అనుభవించిన వాళ్లే జీవితంలో పైకి ఎదగడానికి అవకాశాలను సృష్టించుకుంటారని తెలియజేశారు. పొగాకు బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అద్దంకి శ్రీధర్బాబు మాట్లాడుతూ విద్యార్థులు రాబోయే 10 సంవత్సరాల్లో ఏమి అవ్వాలనుకుంటున్నారో ముందే నిర్దిష్ట లక్ష్యాన్ని నిర్ణయించుకుని ముందుకెళ్లాలన్నారు. విజ్ఞాన్ విద్యా సంస్థల చైర్మన్ లావు రత్తయ్య మాట్లాడారు.

విజేతలకు బహుమతులు..

జాతీయ స్థాయి విజ్ఞాన్స్ నిరులోత్సవ్లో భాగంగా మొత్తం 39 ఈవెంట్లను నిర్వహించారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులకు విలువైన నగదు బహుమతులతో పాటు ట్రోఫీలు, సర్టిఫికెట్లను అందించారు. కార్యక్రమంలో నిరుల ప్రిన్సిపాల్ పాతూరి రాధిక, కన్వీనర్ డాక్టర్ వి.సుజాతపాల్గొన్నారు.

చీరాలలో సూపర్ స్పెషాలిటీ డాక్టర్ల అవగాహన



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఐఎంఏ చీరాల అధ్యక్షురాలు డాక్టర్ శ్రీదేవి

చీరాల: సూపర్ స్పెషాలిటీ డాక్టర్లు చీరాలకు రావడం హర్షించదగిన విషయమని ఐఎంఏ చీరాల అధ్యక్షురాలు డాక్టర్ పీ శ్రీదేవి అన్నారు. చీరాలకు చెందిన ధృతి సూపర్ స్పెషాలిటీ క్లీనిక్స్ ఆధ్వర్యంలో వివిధ స్పెషలిస్ట్ డాక్టర్లతో ఆదివారం స్థానిక ఐఎంఏ హాలులో అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి శ్రీదేవి, కార్యదర్శి డాక్టర్ పి.శ్రీకాంత్లు హాజరై మాట్లాడారు. చీరాల పరిసర ప్రాంత ప్రజలకు గుంటూరు, విజయవాడ వెళ్లనవసరం లేకుండా చీరాలలోనే సూపర్ స్పెషాలిటీ డాక్టర్లు అందుబాటులోకి రావడం మంచివిషయమన్నారు. విజిటింగ్ డాక్టర్లు రావడం వలన ప్రజలకు కూడా ఇబ్బందులు తప్పుతాయన్నారు. అనంతరం గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ డాక్టర్ వెలినేని శ్రీకాంత్, కార్డియాలజిస్ట్ డాక్టర్ బండ్లమూడి శివాజీ, యూరాలజిస్ట్ డాక్టర్ పెంట్యాల శ్రీకాంత్, జనరల్ మెడిసిన్ డాక్టర్ రేవూరి హరికృష్ణ వివిధ అంశాలపై అవగాహన సదస్సులో చర్చించారు. కార్యక్రమానికి 50 మంది ఐఎంఏ డాక్టర్లు కార్యక్రమానికి హాజరయ్యారు.

రేపటి నుంచి సాగర్మాత ఉత్సవాలు

విజయపురిసౌత్: సర్వమతాల సంగమంగా, ఆధ్యాత్మిక భావనకు ప్రతీకగా వెలుగొందుతున్న సాగర్ మాత మహోత్సవాలను ఈ నెల 7, 8, 9 తేదీలలో ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. దేశంలోనే భారతీయ సంప్రదాయ రీతులలో నిర్మించిన తొలి క్రైస్తవ మందిరంగా దీన్ని చెబుతారు. ఉత్సవాలకు రెండు లక్షల మంది భక్తులు హాజరవుతారని అంచనా వేస్తున్నారు.

ప్రారంభం ఇలా..

సాగర్మాత ఉత్సవాలను 7వ తేదీ ఉదయం 5.30 గంటలకు విచారణ గురువులు పామిశెట్టి జోసఫ్ బాలసాగర్ దివ్యబలిపూజతో ప్రారంభమవుతాయి. గురుశ్రీ జోసఫ్ తంబి అన్నెం, గోవు జోసఫ్, రెంటచింతల విచారణ గురువులు ఏరువ లూర్దు మర్రెడ్డి దివ్యబలిపూజ, సాగర్మాత కళాకారుల బృందంతో సాగర్మాత– సహాయమాత బుర్రకథ, రాత్రి 9గంటలకు ధనవంతుడు బీదలాజరు బైబిల్ నాటకం ప్రదర్శించనున్నారు. 8వ తేదీ ఉదయం రాచకొండరాజు, గురుశ్రీ నాగోతు చిన్నయ్య, కొచ్చర్ల జ్యోతిరాజు, ఫిరంగిపురం విచారణ గురువులు పామిశెట్టి బాలస్వామి, చెరుకుపల్లి విచారణ గురువులు అల్లం శౌర్రెడ్డి, మంగళదాస్నగర్ విచారణ గురువులుసిరెడ్డి జోషప్రెడ్డి జపమాల క్షేత్రంలో సమిష్టి దివ్యబలిపూజ నిర్వహించనున్నారు.

ప్రధాన మహోత్సవం

9వ తేదీ సాగర్మాత రథోత్సవం నిర్వహించనున్నారు. మాచర్ల మండలం కొప్పునూరు ప్రాథమిక వైద్యశాల ఆధ్వర్యంలో పండుగ మూడు రోజులు వైద్య శిబిరం, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేస్తున్నారు. మాచర్ల ఆర్టీసీ డిపో ఆధ్వర్యంలో ప్రతి అరగంటకు విజయపురిసౌత్లోని సాగర్మాత దేవాలయానికి బస్లు అందుబాటులో ఉంటాయి. ఉత్సవాలకు తరలి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా పోలీసులు తగిన ఏర్పాట్లు చేశారు.

స్కూటీని ఢీకొట్టిన ఇన్నోవా

వృద్ధురాలు మృతి, ఇద్దరికి గాయాలు

జే పంగులూరు: రోడ్డును క్రాస్ చేయబోయిన స్కూటీని ఇన్నోవా ఢీకొట్టడంతో వృద్ధురాలు అక్కడికక్కడే మృతి చెందిగా ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ ప్రమాదం జాతీయ రహదారిపై వెంకటాపురం స్టేజి సమీపంలో ఆదివారం రాత్రి జరిగింది.

రేణింగవరం ఎస్ఐ తిరుపతిరావు వివరాల మేరకు.. పంగులూరు మండలంలోని అలవలపాడు గ్రామానికి చెందిన ఎర్రమోసు మోహన్ రావు, గొట్టిపాటి వసంత, గొట్టిపాటి సుబ్బమ్మ(77) స్కూటీపై అలవలపాడు నుంచి అద్దంకికి బయలుదేరారు. జాతీయ రహదారిపై అలవలపాడు స్టేజి దాటి వెంకటాపురం స్టేజి వైపు వెళ్లేందుకు రోడ్డు దాటుతుండగా గుంటూరు వైపు నుంచి వస్తున్న ఇన్నోవా కారు స్కూటీని ఢీకొంది. ఈ ప్రమాదంలో స్కూటీపై మధ్యలో కూర్చున్న గొట్టిపాటి సుబ్బమ్మ కిందపడగా తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మరణించింది. ఎర్రమోసు మోహన్రావు, గొట్టిపాటి వసంతలకు స్వల్ప గాయాలయ్యాయి. ఎస్ఐ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం



మాట్లాడుతున్న ఘంటసాల శ్రీనివాసరావు, వేదికపై ఎం.రాధారాణి, నేహాగున్నీ

గుంటూరు మెడికల్: వృత్తి జీవితం, దైనందిన కార్యక్రమాల్లో ఎదురయ్యే ఒత్తిడిని క్రీడలతో జయించవచ్చని, క్రీడలతో మానసిక ఉల్లాసం లభిస్తుందని ఏపీఎన్జీఓ జిల్లా అధ్యక్షుడు ఘంటసాల శ్రీనివాసరావు అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా అసోసియేషన్ ఆధ్వర్యంలో మూడు రోజులుగా జరుగుతున్న వివిధ సాంస్కృతిక, క్రీడా పోటీల్లో భాగంగా ఆదివారం గుంటూరు నగరంపాలెంలోని ఆఫీసర్స్ క్లబ్ ఇండోర్ స్టేడియంలో షటిల్ టోర్నమెంట్ జరిగింది. అడిషనల్ ఎస్పీ సుప్రజ, నేహా గున్ని అతిథులుగా విచ్చేసి షటిల్ పోటీలను లాంఛనంగా ప్రారంభించారు. వారు మాట్లాడుతూ ఉద్యోగం చేసే మహిళలు ఆఫీసుల్లో ఎక్కువగా ఒత్తిడికి గురవుతుంటారని పేర్కొన్నారు. వారు ఒత్తిడిని జయించేందుకు ఇలాంటి క్రీడలు ఎంతో ఉపయోగపడతాయని చెప్పారు. ఆటలతో అందరి మధ్య ఐక్యత వస్తుందని, జట్టుగా పనిచేసే లక్షణాలు అలవాడతాయన్నారు. ప్రతి రోజూ ఆటలు ఆడటం వల్ల శారీరక, మానసిక ఉల్లాసం లభిస్తుందని, ఆరోగ్యం కోసం ప్రతి రోజూ కొంత సమయం క్రీడలకు కేటాయించాలని తెలిపారు. ఘంటసాల శ్రీనివాసరావు మాట్లాడుతూ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న మహిళా ఉద్యోగినులకు పది రకాల క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో పోటీలు నిర్వహించామని చెప్పారు. ప్రతి రోజూ సాయంత్రం వేళల్లో గుంటూరు ఏపీఎన్జీఓ హోమ్లో షటిల్ ఆడుకునేందుకు మహిళలకు ప్రత్యేకంగా ఆట స్థలం ఉందని, ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సెంట్రల్ ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ విల్సన్బాబు, అసోసియేషన్ జిల్లా సెక్రటరీ శెట్టిపల్లి సతీష్కుమార్, మహిళా విభాగం చైర్పర్సన్ ఎం.రాధారాణి, కన్వీనర్ కె.లక్ష్మీరమ్య, నగర అధ్యక్షుడు ఎస్పీఎస్ సూరి, నగర కార్యదర్శి చింతల కళ్యాణ్కుమార్, జిల్లా, నగర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు. షటిల్ పోటీల్లో నీటిపారుదల శాఖకు చెందిన నందిని, గ్రామ వార్డు సచివాలయానికి చెందిన అరుణ విజేతలుగా నిలిచినట్లు మహిళా విభాగం చైర్పర్సన్ ఎం.రాధారాణి తెలిపారు.